ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం
25 జనవరి
2026





# పరీక్ష.. ఒక ఉత్సవం

ఒత్తిడి వద్దు - విజయం ముద్దు!

**భువనగిరి పీఎం కేంద్రీయ విద్యాలయంలో 'పరీక్షా పే చర్చ-2026' క్విజ్ సంబరం**

**ముఖ్య అతిథిగా ఐఏఎస్ ట్రైనర్ రవి కుమార్ ప్రజాపతి: విద్యార్థులకు స్ఫూర్తిదాయక ప్రసంగం**



భువనగిరి, జనవరి 23 (రోమింగ్ న్యూస్ ప్రతినిధి): పరీక్షలంటే భయం కాదు.. అదొక పండుగ అని చాటిచెబుతూ, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన 'పరీక్షా పే చర్చ (క్విజ)--2026' వేడుకలు భువనగిరిలో శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక పీఎం కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన ఈ క్విజ్ పోటీలు విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టడమే కాకుండా, వారిలో పరీక్షల పట్ల ఉన్న ఆందోళనను పారద్రోలాయి.

### ప్రేరణాత్మక ప్రయాణం: ఐస్క్రీం విక్రేత నుంచి ఐఏఎస్ ట్రైనర్ వరకు..

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ విద్యావేత్త, శాంతా లక్ష్మి ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు శ్రీ రవి కుమార్ ప్రజాపతి తన జీవన ప్రస్థానంతో విద్యార్థులను మంత్రముగ్ధులను చేశారు. చిన్నతనంలో ఐస్క్రీంలు అమ్ముతూ, ఎన్నో కష్టాలను ఎదుర్కొని, రాష్ట్ర స్థాయిలో లా సెట్లో రెండో ర్యాంకు సాధించి, నాలుగు సార్లు ఐఏఎస్ ఇంటర్వ్యూ వరకు వెళ్లిన ఆయన అనుభవాలు విద్యార్థులకు గొప్ప పాఠంగా నిలిచాయి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మార్కులు మాత్రమే జీవితాన్ని శాసించవు. నిరంతర శ్రమ, క్రమశిక్షణ, మొక్కవోని ఆత్మవిశ్వాసం ఉంటే ఆకాశమే హద్దుగా ఎదగవచ్చు. విద్యార్థులు పరీక్షలను ఒక భారంగా కాకుండా, తమ సామర్థ్యాన్ని నిరూపించుకునే అవకాశంగా భావించాలి" అని పిలుపునిచ్చారు.



### హోరాహోరీగా క్విజ్ పోటీలు

ఈ క్విజ్ కార్యక్రమంలో కేవలం కేంద్రీయ విద్యాలయ విద్యార్థులే కాకుండా, సిబిఎస్ఈ అనుబంధ పాఠశాలలు, కేజీబీవీలు, టీజీఎంఎస్ పాఠశాలల నుంచి 100 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. మధ్యస్థాయి, సెకండరీ స్థాయిల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

### మానసిక స్థైర్యమే ముఖ్యం: ప్రిన్సిపాల్ చంద్ర మౌళి

పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ ఎన్. చంద్ర మౌళి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనల నుంచి పుట్టిన 'పరీక్షా పే చర్చ' విద్యార్థుల మానసిక స్థితిని మారుస్తోందని అన్నారు. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఉండటానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఎస్మార్ట్ టీచర్లు, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# లోటస్ లాప్ స్కూల్స్‌లో ముందస్తు గణతంత్ర వేడుకల సందడి






హైదరాబాద్, రోమింగ్ న్యూస్: లోటస్ లాప్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన దిల్‌సుఖ్‌నగర్, బోడుప్పల్ మరియు బడంగిపేట్ శాఖల్లో శుక్రవారం ప్రీ--గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాలు దేశభక్తి భావాలతో నిండిపోగా, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఎఫ్‌వైపీ (FYP) విభాగానికి చెందిన చిన్నారులు దేశభక్తి గీతాలు, నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విద్యావేత్త, పర్యావరణవేత్త మరియు పాఠశాల చైర్మన్ డాక్టర్ లయన్ కొమటిరెడ్డి గోపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నతనం నుంచే రాజ్యాంగ విలువలు, క్రమశిక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ వేడుకల్లో డైరెక్టర్ కొమటిరెడ్డి అభిషేక్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ మాధవి సంఘి, శ్రుతిలయ రెడ్డి, అడ్మిన్ ఆఫీసర్ స్వర్ణలత, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు. అయితే, ఇవి కేవలం ముందస్తు వేడుకలేనని, అధికారిక గణతంత్ర దినోత్సవ వేడుకలు జనవరి 26న ప్రభుత్వ నియమావళి ప్రకారం నిర్వహిస్తామని పాఠశాల యాజమాన్యం స్పష్టం చేసింది. బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతామని విద్యార్థులు చేసిన ప్రతిజ్ఞతో వేడుకలు ముగిశాయి

# మేడారంలో స్త్రీశక్తి షాపుల ఏర్పాటు

### నిత్యావసరాలు, ఆహార పదార్థాల స్టాల్స్

### రూ. 6 కోట్ల వ్యయంతో 565 షాపులు

**ములుగు,జనవరి24 :** మహిళాభ్యున్నతికి తెలంగాణ ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నది. ప్రతి సందర్భాన్ని మహిళల ఆర్థిక చేకూర్పుకు అవకాశంగా మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు అవసరమైన నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలు విక్రయించుటకు ఇందిరా మహిళా శక్తి ద్వారా రూ. 6 కోట్ల వ్యయంతో 565 షాపులను ప్రభుత్వం రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా ప్రభుత్వం మంజూరు చేసింది. మొత్తం 37 లొకేషన్లలో 27 రకాల వ్యాపారాలను మహిళలు నిర్వహించనున్నారు. ఇందులో మేడారం చుట్టుపక్కల ప్రాంతాల్లో 464 యూనిట్స్, మేడారం రాక పోకలు జరిగే మార్గంలో 63 యూనిట్స్ ఏర్పాటు చేశారు. మిగిలిన యూనిట్స్ ఇతర చోట్ల నెలకొల్పారు. మంత్రి శ్రీమతి దనసరి అనసూయ- సీతక్క చొరవతో మేడారం



జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన స్టాల్స్ ద్వారా ఈ ప్రాంత సంఘాల మహిళలు లబ్ది పొందనున్నారు. ఇందిరా మహిళా శక్తి ద్వారా ఇప్ప పువ్వు లడ్డులు, మిల్లెట్ లడ్డులు, రాగి లడ్డులు, పల్లీ లడ్డులు విక్రయ స్టాల్స్, ఇప్ప నూనె, కారం, పసుపు, మసాలా యూనిట్స్, రాగి జావ/టిఫిన్, రొట్టెల యూనిట్, మి÷-లలెట్ షేక్, స్వీట్ కార్న్, పాప్ కార్న్, టీ స్టాల్స్, స్నాక్స్ స్టాల్స్, తెలంగాణ పిండి వంటలు, పచ్చళ్ళు, పూజా సామాగ్రి విక్రయ స్టాల్స్ తో పాటు బేకరీ, బ్యాంబు చికెన్, చికెన్, క్లాత్ రెడీ మేడ్ డ్రెస్సెస్, గాజులు, బెల్లం, కొబ్బరికాయలు, పూలు, భోజన, అల్పాహార, కిరాణా జనరల్ స్టోర్, కూల్ డ్రింక్స్, పాలు, ఫాస్ట్ ఫుడ్, మొబైల్ ఫిష్ / కర్రీ అవుట్ లెట్, కోళ్ల విక్రయ అవుట్ లెట్, కోడి గుడ్ల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్ ద్వారా ఆయా కుటుంబాలు ఆర్థికముగా అభివృద్ధి చెందనున్నాయి. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇందిరా మహిళా శక్తి పథకం అండగా నిలుస్తుంది.

# మెడిసిన్ చదివేందుకు కేసీఆర్ చేయూత



ఎర్రవెల్లి, రోమింగ్ న్యూస్: బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకుడు , ఉద్యమకారుడు , ములుగు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కుసుమ జగదీశ్ కుటుంబానికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి , బి.ఆర్.ఎస్ అధినేత కేసీఆర్ గారు అండగా నిలిచారు. పార్టీలో మొదటి నుండి క్రియాశీలకంగా వ్యవహరించిన కుసుమ జగదీశ్ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించారు. జగదీశ్ కుమార్తె సుకీర్తి మెడిసిన్ చదవడానికి ప్రయత్నిస్తున్న విషయం గురించి కేసీఆర్ గారు పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్నారు. ఆమె మెడిసిన్ చదవడానికి అవసరమైన ఫీజు చెక్కును శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో సుకీర్తికి అందజేశారు. మంచిగా చదువుకోవాలని , కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని సుకీర్తిని ఆశీర్వదించారు. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ , మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఉన్నారు .



హైదరాబాద్, రోమింగ్ న్యూస్: ప్రసిద్ధ కవి విమర్శకులు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఇటీవల( ఐఏఎస్) పదోన్నతి పొందిన సందర్భంగా హైదరాబాదులో ఆయన కార్యాలయంలో విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ మారుమూల గ్రామం నుండి ఐఏఎస్ దాకా ఎదిగిన డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి సాహిత్యంలోనేటి యువతకు స్ఫూర్తి స్ఫూర్తిదాయకం అని అన్నారు .ఈ కార్యక్రమంలో యువకవి బూరుగు గోపికృష్ణ, గాయకులు, పోలోజు వెంకటాచారి, తదితరులు పాల్గొన్నారు.

# పాతగుట్టలో నారసింహుడి 'అధ్యయనోత్సవాలు' షురూ

**తిరుమంజనం, తొళక్కంతో అధ్యయనోత్సవాలకు శ్రీకారం**

**ఈ నెల 27 వరకు నాలుగు రోజుల పాటు ఉత్సవాలు అధ్యయనోత్సవాలు**

**అధ్యయనోత్సవాలు, బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు ఆర్జిత సేవలు రద్దు**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట దేవస్థానానికి అనుబంధ ఆలయమైన పూర్వగిరి(పాతగుట్ట) శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం అధ్యయనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, సురేంద్రాచార్యుల అర్చకత్వంలో అర్చకులు తిరుమంజనం, తొళక్కం పూజలతో అధ్యయనోత్సవాలకు శ్రీకారం చుట్టారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆలయంలో నిత్య ఆరాధనల అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయంలోని స్వామివారి మూలవిరాట్లకు 'తిరుమంజన' మహోత్సవాన్ని ఆలయ సంప్రదాయరీతిలో పారాయణీకుల పారాయణాలు, వేదపండితుల వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో స్వామివారికి నిత్యారాధనల తర్వాత 'తొళక్కం' ఉత్సవాన్ని అర్చకులు ఘనంగా జరిపించారు. తొలిరోజు అధ్యయనోత్సవ కార్యక్రమంలో ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ వినోద్ రెడ్డి, చైర్మన్ నరసింహమూర్తి, ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్ శర్మ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మొదలైన ఈ ఉత్సవాలు ఈ నెల 27 వరకు నాలుగు రోజుల పాటు వైభవంగా కొనసాగనున్నాయి. మరోవైపు అధ్యయనోత్సవాల సందర్భంగా ఆలయంలో నిత్యం నిర్వహించే ఆర్జిత సేవలు, నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవాలను తాత్కాలికంగా రద్దు చేశారు. రద్దు చేయబడిన ఆర్జిత సేవలు వార్షిక బ్రహ్మోత్సవాల అనంతరం ఫిబ్రవరి 4 నుండి తిరిగి పునరుద్ధరించనున్నారు.

### నేడు పురప్పాట్టు సేవ, దివ్యప్రబంధ సేవాకాలం

పాతగుట్ట నరసింహుడి ఆలయంలో రెండో రోజు అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి మూలవరులకు పురప్పాటు సేవ, తిరుమంజనం, దివ్య ప్రబంధ సేవాకాలం నిర్వహించనున్నారు. ఉదయం పురప్పాట్టు సేవ, దివ్యప్రబంధ సేవాకాలం, తిరుమంజనం.. సాయంత్రం పురప్పాట్టు సేవ, దివ్య ప్రబంధ సేవాకాలం చేపట్టనున్నారు.

